సూర్య
18వ
www.suryaa.com
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
ఆదివారం,24 నవంబర్ 2024


# శెట్టిబలిజ వన సమారాధన విజయవంతం చేద్దాం



– ఎటువంటి హంగమాలు యువత చేయవద్దు – ఐక్యత చాటుద్దాం
– అన్ని కులాలు సమానత్వం అని చాటుదాం – మంత్రి వాసంశెట్టి సుభాష్

**అమలాపురం,మేజర్‌న్యూస్ :** శెట్టిబలిజ వనసమారాధనను మరింత ప్రతిష్ఠాత్మకరంగా అమలాపురంలో నిర్వహిస్తున్నామని అందుకు అందరూ సహకరించాలని రాష్ట్రకార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. శనివారం మంత్రి స్వగృహం నందు ఏర్పాటు విలేకర్ల సమావేశంలో అయన మాట్లాడుతూ ఈ సమారాధన మిగిలిన కులాలకు ఆదర్శంగా ఉండాలని ఆయన అన్నారు. యువత ఎటువంటి హంగమా చేయవద్దని, సైలెన్సర్లు తీసి వెహికల్స్ నడపవద్దని, పోలీస్‌కు పూర్తిగా సహకరించాలని మంత్రి కోరారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్య నారాయణరావు మాట్లాడుతూ సంఘీయుల పటిష్టతకు వన సమారాధన లు ఎంతగానో ఉపయోగపడతాయి అన్నారు. అమలాపురంలో నిర్వహించే ఉభయ రాష్ట్రల శెట్టిబలిజ సమారాధనను విజయవంతం చేయాలన్నారు. పార్టీలకు అతీతంగా ఈ కార్యక్రమం చేస్తున్నామని పెచ్చేట్టి చంద్రమౌళి అన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు వాసంశెట్టి సత్యం,మట్టపర్తి నాగేంద్ర, వాసంశెట్టి సత్యం, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ, పెచ్చేట్టి చంద్రమౌళి, వాసంశెట్టి సత్యం, మట్టపర్తి నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# తూర్పు,పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను

## సజావుగా ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించాలి

– ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు మేరకు ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలి
– సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రత చర్యలు – కలెక్టర్ పి.ప్రశాంతి




**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** డిసెంబర్5వతేదీన నిర్వహించనున్న తూర్పు, పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను సజావుగా ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు అన్నిఏర్పాట్లు పూర్తి చెయ్యాలని జిల్లాకలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. శనివారం స్థానిక జిల్లాకలెక్టర్ కార్యాలయ సమావేశమందిరంలో తూర్పు, పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు సంబంధించి రెవిన్యూ పోలీస్ ఇతర ఎన్నికలు విధులు నిర్వహించే ఎంసిసి, ఎఫ్ ఎస్ టి, ఎస్ఎస్‌టి, ఎంసిఎంసి బృందాల చేపట్టి నిధులపై కలెక్టర్ పి ప్రశాంతి, ఎస్పి డి.నర్సింహ కిషోర్ , జెసి చిన్న రాముడు, సహాయ ఎన్నికల అధికారి, డి ఆర్వో టి సీతారామ మూర్తి లతో కలిసిసమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలోడిసెంబర్ 5వ తేదీన నిర్వహించనున్న తూర్పు, పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను ఎన్నికల ప్రవర్తన నియమావళికి అనుగుణంగా సజావుగా నిర్వహించాలన్నారు.ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో మొత్తం అయిదు మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని తెలిపారు. పోలింగ్ ప్రక్రియ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 20 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మొత్తం 2894 మంది ఉపాధ్యాయుల ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో 1589 పురుషులు కాగా 1305 మంది మహిళలు ఉన్నారని తెలిపారు. ఎమ్మెల్సీ ఉపాధ్యాయ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి 21 మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ బృందాలు, 20 ఎఫ్ ఎస్‌టి బృందాలు,6ఎస్ఎస్‌టి బృందాలను నియమించమన్నారు. అన్ని సెక్టోరల్ రూట్ అధికారులు ముందుగానే వారికి కేటాయించిన మండలాల్లోనిరూట్‌లను పరిశీలించుకోవాలన్నారు. వనరులబుల్ పోలింగ్ కేంద్రాలను ముందుగానే భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ కు ముందురోజు పోలింగ్ మెటీరియల్ ఆర్ట్స్ కళాశాలలో పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే పిఓ, పిఓలకు, ఎన్నికల విధులు నిర్వహించే ప్రతి ఒక్కరికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. అనుభవం కలిగిన వారికి ఎన్నికల విధుల్లో నియమించడం జరిగింది అని పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ మౌలిక సదుపాయాలను కల్పించడం జరిగిందని, త్రాగునీరు, విద్యుత్, షామియానాలు, ర్యాంపులు, టాయిలెట్, టెలిఫోన్, తదితర వసతులను కల్పించామన్నారు. జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ మాట్లాడుతూ జిల్లాలో డిసెంబర్ 5 వ తేదీన నిర్వహించనున్న తూర్పు, పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 20 రూట్లలో, పోలింగ్ కేంద్రాల్లో బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా పోలింగ్ మెటీరియల్ పంపిణీ కేంద్రం లోను, రిసెప్షన్ సెంటర్ నందు, ప్రవేశ ద్వారము, బయటికి వెళ్లే మార్గం నందు పోలీస్ భద్రతను ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా అంతర్ జిల్లాల సరిహద్దుల్లో ని చెక్ పోస్ట్ నందు ప్లేయింగ్ స్క్వాడ్స్ నిఘా ఉంచడం జరిగిందన్నారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు. డిఆర్ఓ , సహాయ ఎన్నికల అధికారి టి. సీతారామమూర్తి, ఎన్నికల అధికారి ఎమ్. మాధురి, ఆర్డీవోలు ఆర్. కృష్ణ నాయక్, రాణి సుస్మిత, డి.ఎస్.పిలు టీవీఆర్కే కుమార్,కే.రమేష్‌బాబు,డీటిఓ ఎన్.సత్యనారాయణ,జిల్లా రవాణా అధికారి ఆర్. సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడ జిల్లా అభివృద్ధి, కొత్త ప్రాజెక్టుల కోసం పార్లమెంట్‌లో గళం వినిపిస్తా

– కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా అభివృద్ధితో పాటు రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధులు, కొత్త ప్రాజెక్టుల కోసం పార్లమెంట్‌లో గళం వినిపిస్తానని కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 25 నుండి డిసెంబర్ 20 వరకు జరగనున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో పాల్గొనేందుకు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ఢిల్లీకి పయనమయ్యారు. అంతకుముందు శుక్రవారం మంగళగిరిలో జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ ఎంపీలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని పార్లమెంట్‌లో జనసేన పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ శీతాకాల సమావేశాల్లో కూటమి ఎంపీలు రాష్ట్ర అభివృద్ధికి కలిసికట్టుగా పోరాడుతామన్నారు. ముఖ్యంగా కాకినాడ జిల్లా అభివృద్ధి కోసం కొత్త ప్రాజెక్టులు మంజూరుతోపాటు, పెండింగ్ ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి చేసేలా కేంద్ర సహకారం కోరతానని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పార్లమెంటు సమావేశాల్లో వైసిపి ఎంపీలు రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలేసి తమ అధినేత కోసం మాత్రమే పోరాడారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ఎంపీలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనలతో రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధులు కోసం కేంద్రంపై ఒత్తిడి తెస్తామని తెలిపారు.

# కలెక్టరేట్ల వద్ద ధర్నాను జయప్రదం చేయండి



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** నవంబర్ 26న దేశవ్యాప్తంగా జరుగుతున్న ధర్నాను జయప్రదం చేయాలని గోడపత్రిక ఆవిష్కరించారు. కార్మికులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, దేశవ్యాప్తంగా నవంబర్ 26న కేంద్ర, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నాలను నిర్వహించడం జరుగుతుందని, ఈ ధర్నాలను జయప్రదం చేయాలని కోరుతూ, పెద్దాపురం పట్టణంలో యాసలపు సూర్యారావు భవనంలో సిఐటియు ఆధ్వర్యంలో గోడపత్రిక అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండలాధ్యక్షులు గడిగట్ల సత్తిబాబు, వడ్డి సత్యనారాయణ, ఆదిరెడ్డి శ్రీను, వర్రే రమణ, పి.పద్మ, స్నేహలత, తాడిశెట్టి గంగ, క్రాంతికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మరిడమ్మ అమ్మవార్కి పంచామృతాభిషేకం



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు శనివారం ఆలయ అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో వేదపండితులు మరిడమ్మ అమ్మవార్కి మండపంలో జన్మ నక్షత్రం మఖ నక్షత్రం సందర్భంగా పంచామృతాభిషేకం, పసుపు, కుంకుమ, చందనం, విభూదిలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించి, అనంతరం స్వర్ణ, రజతాలతో ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం శ్రీ అమ్మవారి పారాయణం చేసిన మహిళా భక్తులకు, ఇతర భక్తులకు దేవస్థాన ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్, సిబ్బంది వెంకటరమణ, గౌరి, వరహాలు, లోవ, శివ తదితరులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ దాడులలో 600 లీ. బెల్లపు ఊట ధ్వంసం

– 10 మద్యం సీసాలు స్వాధీనం



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం ఎక్సైజ్ సిఐ కె.వి.వి.డి.అర్జునరావు ఆదేశాల మేరకు ఆధ్వర్యంలో పెద్దాపురం సర్కిల్ పరిధిలోని గండేపల్లి మండలంలోని సూరంపాలెం గ్రామంలో సారాయి తయారీకి నిల్వ ఉంచిన సుమారు 600 లీ. బెల్లపు ఊట ధ్వంసం చేయడం జరిగిందని, అలాగే యర్రంపాలెం గ్రామంలో అక్రమ మద్యం సీసాలు అమ్ముతున్న మహిళ నుండి 10 డ్యూటిఫైడ్ లిక్కర్ బాటిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సిఐ కె.వి.వి.డి.అర్జునరావు తెలిపారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్సైలు మరియు ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కోటిమొక్కలు పెంచడమే లక్ష్యంగా పని చేస్తున్నాం

– సిసిఎఫ్ బివిఎన్ఎన్ మూర్తి




**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** కోటి మొక్కల పెంచడమే లక్ష్యంగా పని చేస్తున్నామని రాజమహేంద్రవరం సీసీఎఫ్ బి ఎన్ ఎన్ మూర్తి అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక ఫారెస్ట్ రేంజ్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగాతనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిసిఎఫ్ మూర్తి స్థానిక్ విలేకర్లతో మాట్లాడుతూ ప్లాంటేషన్ రేజ్ చేస్తున్నామని మట్టి సమస్యను( ఎస్ఎంసి) చెక్ డామ్, నీటి గుంతలు, నీటి సంరక్షణ, వేసంగి కాలంలో అగ్ని ప్రమాదాలు జరగకుండా అడవిలో ఫైర్ లైన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా ఏలూరు, రంపచోడవరం, చింతూరు డివిజన్లలో అగ్ని ప్రమాదం నివారణకు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సిసిఎఫ్ తెలిపారు. అలానే ప్రొటెక్షన్ కు తగిన చర్యలుచేపడుతున్నామన్నారు. వచ్చే ఏడాదికి ప్లాంటేషన్ కొరకు నర్సరీలు విస్తృతపరుస్తామన్నారు. ప్రస్తుతం8 జిల్లాలో 35 నర్సరీలు సాగు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఫారెస్ట్ అనుమతులతో 5 మైనింగ్ క్వారీలు నడుస్తున్నట్లు మరో మూడు ఫారెస్ట్ అనుమతులు లేకుండా నడుపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని దీనిపై కోర్టులో పిటిషన్ వేసినట్లు ఆయన వివరించారు. ఎన్ హెచ్5 16 జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఫారెస్ట్ ల్యాండ్ ఇవ్వాలి అంటే ప్రత్యామ్నయంగా రెవెన్యూ అధికారులు భూమి ఫారెస్ట్ కి ఇచ్చినట్లయితే అభ్యంతరాలు ఉండవని ఆ ప్రక్రియకు కూడా ఒక నెలలోగా పూర్తి అవుతుందన్నారు. 350 హెక్టర్ లో అటవీ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ఎం జి ఎన్ ఆర్ ఈజీఎస్ నిధులతో కోటి మొక్కలు పెంపకం జరుగుతుందన్నారు. అడవి ప్రొటెక్షన్, వన్యమృగ సంరక్షణ కొరకు సుమారు 400 మంది ఫ్రంట్ లైన్ స్టాఫ్ అవసరం ఉందని ప్రభుత్వం రిక్రూట్మెంట్ చేసినట్లయితే స్టాఫ్ కొరతతీరుతుందని సుమారు 20 లక్షల హెక్టర్ లో ఫారెస్ట్ విస్తరించి ఉందన్నారు. రోజ్ వుడ్ ప్లాంటేషన్ కు సన్నాహాలు చేస్తున్నట్లు సిసిఎఫ్ తెలిపారు. అనంతరం జడ్డింగ్ సెక్షన్కు చెంది చెరుకుంపాలెం లో 1982 లో నాటిన 10 హెక్టార్ల టేక్ ప్లాంటేషన్ ను ఆయన పరిశీలించారు. ఈ మేరకు సిబ్బందికి తక్కువ సూచనలు చేశారు. సిసిఎఫ్ వెంట డి ఎఫ్ ఓ రవీంద్ర ద్వామ, సబ్ డి ఎఫ్వో జేవి సుబ్బారెడ్డి, స్థానిక రేంజ్ ఆఫీసర్ ఉషా రాణి, అడ్డతీగల రేంజ్ అధికారి సయ్యద్ షహంసా, ఎఫ్ ఎస్ ఓ మూర్తి, ఫారెస్ట్ సిబ్బంది ఉన్నారు.


# ఉపాది కోసం వెళ్ళి నరకయాతన


– రాష్ట్ర ప్రభుత్వ చొరవతో శుక్రవరం సురక్షితంగా తిరిగి స్వదేశానికి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** బతుకు తెరువు కోసం కువైట్ వెళ్లి అక్కడ చిత్రహింసలకు గురైన గండేపల్లి మండలం యల్లమిల్లి గ్రామానికి చెందిన మహిళ గారా కుమారి రాష్ట్ర ప్రభుత్వ చొరవతో శుక్రవరం సురక్షితంగా తిరిగి స్వదేశానికి వచ్చింది.భర్త చనిపోయి, ఇళ్లు గడవడం కష్టమైన పరిస్థితులల్లో తన ముగ్గురు పిల్లల పోషణ, భవిష్యత్తు కోసం ఈమె పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన ఏజెంట్ యం.సుధాకర్ ద్వారా గత మే నెల 1వ తేదీన ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లింది. కువైట్ దేశంలో 30 వేల జీతంతో ఇంటి పనులు చేసేందుకు ఉద్యోగంలో చేరింది. అయితే తాను పనిచేసే యజమాని తీవ్ర ఇబ్బందులకు, చిత్రహింసకు గురిచేయడంతో నరక యాతనకు లోనైంది. ఉపాధి కోసం వెళ్లి విదేశాలలో నానా యాతనలు పడుతున్నవారిని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదుకుంటున్న విషయాన్ని తెలుసుని, దేశం కాని దేశంలో తాను పడుతున్న అవస్థలను వీడియోగా చిత్రీకరించి, తన సోదరుడు కర్రిపోతు సూర్యచంద్ర ద్వారా వారికి పంపింది. హృదయ విదారకమైన ఆమె దీన పరిస్థితికి చలించిన మంత్రులు ఇరువురు కువైట్ లోని భారత రాయభార కార్యాలయంతో చర్చించి ఆమె తిరిగి స్వదేశానికి వచ్చేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసారు. ఇరువురి చొరవతో గారా కుమారి కువైట్ నుండి విమానంలో హైదరాబాదు చేరుకుని, శుక్రవారం రాత్రికి తన సొంతూరు యల్లమిల్లిలోని తన ఇంటికి చేరుకుంది. ఆమె రాక కోసం ఎదురు చూస్తున్న పిల్లలు, కుటుంబ సభ్యులు పొందిన ఆనందానికి అవధులు లేవు. కష్టాల చీకటిలో కొట్టాడుతున్న తమ కుటుంబానికి కొండంత అండగా నిలచి ఆదుకున్న ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ లకు గారా కుమారి, ఆమె కుటుంబ సభ్యులు చేతులెత్తి నమస్కరిస్తూ వారికి సదా రుణపడి ఉంటామని తెలియజేశారు. అలాగే తాను తిరిగి స్వదేశానికి రావడానికి ఏర్పాట్లు చేసిన జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలికి, జిల్లాయంత్రాంగానికి గారా కుమారి ధన్యవాదాలు తెలియజేసింది.

## ప్రభుత్వానికి నిరసన తెలుపుతూ వాలంటీర్లు ఆందోళన



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** అసెంబ్లీ సాక్షిగా మంత్రులు అబద్దాలు చెప్తున్నారని వాలంటీర్లు రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయం వద్ద శనివారం ధర్నా చేపట్టారు. వాలంటీర్లు వ్యవస్థలో లేకుండా 2024 మే వరకు వేతనాలెలా చెల్లించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో ఐటిడిఏ లు, కలెక్టర్ కార్యాలయాలు ముట్టడిస్తామని హెచ్చరిక చేశారు. అసెంబ్లీలో మంత్రి బాలవీరాంజనేయస్వామి వాలంటీర్ల విషయంలో ప్రజలకు అసత్యాలు చెప్తుంటే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మౌనంగా ఉండడాన్ని తప్పుపడుతూ సిఐటియు ఆధ్వర్యంలో ఏపీ గ్రామ వార్డు వాలంటీర్ల సంఘం రంపచోడవరం ఐటిడిఏ వద్ద ధర్నా నిర్వహించి నిరసన తెలియజేశారు. ఈ ధర్నాను ఉద్దేశిస్తూ సిఐటియు జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.శాంతిరాజు, వాలంటీర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చవలం సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 2023 ఆగస్టు తర్వాత వాలంటీర్లను రెన్యువల్ చేయకుండా 2024 మే వరకు వేతనాలు ఎలా చెల్లించారని ప్రశ్నించారు. ఎన్నికల విధుల నుండి వాలంటీర్లను తప్పించాలని హైకోర్టుకు ఎందుకు వెళ్లారని నిలదీశారు.

దేవాలయం లాంటి అసెంబ్లీలో ప్రజలకు అసత్యాలు చెప్పడానికి మానుకోవాలని, మంత్రి బాలవీరంజనేయస్వామి వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని, చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వాలంటీర్లందరిని కొనసాగించి, 10వేలు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఎన్నో ఆశలతో కూటమినేతలకు ఓట్లు వేసి గెలిపిస్తే ఇలా అబద్ధాలు చెప్పి నమ్మకాన్ని పోగొట్టుకోవద్దని, అవసరమైతే వాలంటీర్లందరిని సమీకరించి ఐటీడీఏలు, కలెక్టరేట్లు ముట్టడిస్తామని హెచ్చరించారు. అడక్కుండా హామీలు ఇచ్చి, అడుక్కునేలా చేశారని నినాదాలిచ్చారు. అదేవిధంగా వాలంటీర్లు ఉద్యోగ భద్రత కల్పించాలని, బకాయి వేతనాలు చెల్లించాలని, ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు మేము అధికారంలోకి వస్తే గ్రామ వార్డు వాలంటీర్లకు కొనసాగిస్తూ 5000 నుండి పదివేల రూపాయలు వేతనం ఇస్తామన్న హామీని అమలు చేయాలని, బలవంతంగా రాజీనామా చేసినవారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకపోతే భారీ ఎత్తున వాలంటీర్లను సమీకరించి ఆందోళనలు చేస్తామని హెచ్చరిక చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వాలంటీర్ల రంపచోడవరం మండల కార్యదర్శి కె.వెంకన్న, కె.భాను, ఎస్.కళావతి, గ్రామ వాలంటీర్లు ఈ ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వెంకట్ పాలమూరికి సత్కారం



**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** అరిగెల బలరామమూర్తి సాహితీ కళా పీఠం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కవితల పోటీలో పర్యావరణ పరిరక్షణ అంశంపై వ్రాసిన కవితలకు సామాజిక సహజకవి, జాతీయ పురస్కార గ్రహీత వెంకట్ పొలమూరిని ఘనంగా సన్మానించారు.వెంకట్‌పొలమూరిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ సంస్థ చైర్మన్ డా.కత్తిమండ ప్రతాప్, కొండా నరసింహారావు, ఎస్.పి. పోలీస్ డిపార్ట్మెంట్, ప్రముఖ కవి బి.వి.వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ సందర్శనలో సంసిధ్ విద్యార్థులు



**అమలాపురం,మేజర్‌న్యూస్ :** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ముమ్మిడివరం మండలంలోని అనాతవరం గ్రామంలో ఉన్న సంసిధ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ఫీల్డ్ ట్రిప్ భాగంగా స్థానికంగా ఉన్న కలెక్టరేట్ ను సందర్శించడం జరిగింది మరియు అమలాపురం ఫైర్ స్టేషన్‌ను, రూరల్ పోలీస్ స్టేషన్ మరియు అమలాపురం బస్ స్టేషన్‌ను, తపాలా కార్యాలయాలను సందర్శించడం జరిగిందని ప్రిన్సిపల్ గోన సునీత అన్నారు. క్యాంపస్ మేనేజర్ వెంకట్ పిప్పళ్ళ మాట్లాడుతూ ఇలాంటి సందర్శన ద్వారా విద్యార్థులకు సామాజిక స్పృహను, వివిధ ప్రభుత్వ శాఖల సేవల పట్ల అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ మరియు ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన తహసిల్దార్ వెంకటేశ్వరి



**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** ఖరీఫ్ పంటలో పండించిన ధాన్యాన్ని రైతులు తమకు నచ్చిన రైస్ మిల్లులకు అమ్ముకోవచ్చని తహసీల్దార్ జె.వెంకటేశ్వరి చెప్పారు. మండలంలోని చిరతపూడిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటేశ్వరి మాట్లాడుతూ మండలంలో ఎంటీయు 1318, ఎంటీయు 7029 రకాల వరి పంటలను రైతులు పండిచారన్నారు. మండలంలో 7,411 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని, ఇప్పటి వరకు 48 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు విక్రయించుకున్నారన్నారు. మండలంలో చిరతపూడితో పాటు గంగలకుర్రు, పుల్లేటికుర్రు, ఇరుసుమండ, ముక్కామలలో ఉన్న ఆర్బీకేలు, సొసైటీల వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే రైతులు ధాన్యాన్ని విక్రయించుకోవచ్చన్నారు. ప్రభుత్వం ప్రకటించిన తేమ శాతాన్ని అనుగుణంగా ధాన్యంను విక్రయకేంద్రాలకు తీసుకువచ్చి పరీక్షించుకోవాలన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర వచ్చేలా చూసి వారికి అవగాహణ కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, ఆర్బీకే, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

## విజయ భాస్కర్ పుట్టినరోజు సందర్భంగా పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణి



**చింతూరు,మేజర్‌న్యూస్ :** రంపచోడవరం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు మఠం విజయభాస్కర్ జన్మదిన సందర్భంగా శనివారం చింతూరు మండల అధ్యక్షుడు ఇల్లా చిన్నారెడ్డి ఆధ్వర్యంలో చింతూరు శబరి ఒడ్డు ఎంపీపీ పాఠశాలలో భాస్కర్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వించారు. ఈ సందర్భంగా పాఠశాల పిల్లలకు స్వీట్స్, బిస్కెట్లు పంచిపెట్టాడంతోపాటు మధ్యాహ్నం భోజనం చేయుటకు పిల్లలకు స్టీల్ ప్లేట్‌లు, గ్లాస్‌లు పంచిపెట్టిడం జరగింది. ఈ కార్యక్రమంలో సయ్యద్ ఆసీఫ్, సురేష్ చౌదరి, శ్రీరామ్‌రెడ్డి,కట్టశంకర్, శ్యామల వినోద్, రవికుమార్, మని, శేఖర్, స్వరూప, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఐక్యతకు ప్రతీక కార్తీక వనసమారాధనలు



**అంబాజీపేట,మేజర్‌న్యూస్ :** అంబాజీపేటలో వెంకట్రాజు ఆయిల్ మిల్ ఆవరణలో ఆ మిల్ వద్ద వ్యాపారాలు నిర్వహించే కొబ్బరి నూనె వర్తకులు శనివారం కార్తీక వన సమారాధనను నిర్వహించారు. ఉసిరి చెట్టు వద్ద అర్చకులు మర్ల శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో కార్తీక దామోదరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన చేపట్టారు. ఈ కార్యక్రమంలో గణపతి వీరరాఘవులు, బొంతు పెదబాబు, మైపాల తాతాజీ, గణపతి బాబి వెంకటేశ్వరరావు, వర్రే చింతన్న, అధికారపు బాబ్జి, కుంపట్ల నాయుడు, సూదాబత్తుల శ్రీను, కొబ్బరి నూనె వ్యాపారులు బిక్కిన వీరన్న, గునిశెట్టి శ్రీను, పత్తి చంటి, గుడేల శ్రీను, తిక్కిరెడ్డి నాగు, బండారు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి కిశోరి వికాశ శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహనకు చక్కటి వేదిక
- డిఎల్ఎస్ఏ ద్వారా సరైన న్యాయ సహాయ సహకారాన్ని అందిస్తాం
- కిషోర్ బాలిక స్వేచ్ఛ తూర్పుగోదావరి జిల్లా గోడ ప్రతి ఆవిష్కరణ
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత



**రాజమహేంద్రవరం, మేజర్‌న్యూస్ :** యుక్తవయస్సులో ఉన్న బాలికల, మహిళల ఉజ్వల భవిష్యత్తుకు కిశోరి వికాస కార్యక్రమం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని,శిక్షణ కార్యక్రమం ద్వారా రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన కల్పించడంలో ప్రధాన పాత్ర పోషిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి గంధం సునీత, జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రకాష్ నగర్ ధర్మచర కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన జిల్లా స్థాయి కిశోరి వికాశం జిల్లా స్థాయి శిక్షకుల శిక్షణా కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా ఎస్పీ నరసింహా కిషోర్ ఇతర అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధంసునీతమాట్లాడుతూ, రాజ్యాంగంలో పొందు పరిచిన హక్కులతోపాటు బాధ్యతలను కూడా పిల్లలకు తెలియ చేయాలన్నారు. ప్రభుత్వ మహిళా సాధికారత, మహిళల అభివృద్ధిపై అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. జాతీయస్థాయిలో నల్సా రూపొందించిన మార్గదర్శకాలను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా మహిళలకు, పేదరికంలో ఉన్న మహిళలకు న్యాయపరంగా రాజ్యాంగం కల్పించిన హక్కులపై వారికి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. సుప్రీం కోర్టు, హై కోర్టు ఆదేశాలను అనుసరించి డిఎల్ఎస్ఏ కార్యక్రమాలు జిల్లాయంత్రాంగం సమన్వయంతో నిర్వహించడం జరుగుతుందన్నారు. న్యాయంతో పాటు సంక్షేమ కార్యక్రమాలపై జిల్లాలో ప్రజలు అవగాహన కలిగి ఉండాలనే లక్ష్యంతో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందరికీ సమన్యాయం అందించేందుకు మండల స్థాయిలో పారా లీగల్ వాలంటీర్లు, లీగల్ ఏయిడ్ క్లినిక్‌ల ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. శిక్షణ పొందిన వారు గ్రామాల్లో యువతకు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ అనే అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. భారత రాజ్యాంగంలోని హక్కులతో పాటు బాధ్యతలను కూడా తెలియజేయాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ ఆడపిల్లల ఉజ్వలమైన,ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు కిశోరి వికాసం పునః ప్రారంభ కార్యక్రమం పునాది వేస్తుందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. శిక్షణ కోసం వచ్చిన అధికారులందరూ ఆడపిల్లల,సమాజ సర్వతోముఖాభివృద్ధికి పాటు పడాలన్నారు. ఈ కార్యక్రమంయుక్తవయస్సులో ఉన్న బాలికల సమగ్ర అభివృద్ధికి మరియు ఆర్థిక స్వావలంబన చేయడానికి ఉద్దేశించబడిన కార్యక్రమంగా కలెక్టర్ పేర్కొన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల్లో వరకట్న మరణాలు ,చైల్డ్‌మ్యారేజ్,గృహ హింస వంటి సంఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తగా ఎదుర్కొనే విధంగా మహిళలను చైతన్యవంతులుగా అవగాహన కల్పించాలన్నారు. యుక్త వయసులో ఉన్న కిషోర్ బాలికలు ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఉండేలా మానసికంగా వారికి అవగాహన కల్పించాలన్నారు. తల్లిదండ్రుల తర్వాత పిల్లలను మంచి పౌరులుగా సమాజం పట్ల బాధ్యతగా పెంచే ప్రయత్నం చేసే విధానం పై నమ్మకం గురువులదే అన్నారు. జిల్లాలో ఆడపిల్లలు పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఐదుగురు టీచర్లను కూడా సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. స్కూల్స్ లో పిల్లలు చదువుకు అనుకూలమైన వాతావరణం కల్పించడంతో పాటు వారి ఎదుగుదల,అభివృద్ధిని ప్రభావితంచేసేలాకార్యక్రమాలు నిర్వహించాలన్నారు. యుక్తవయస్సులోని బాలికల శ్రేయస్సును సమగ్రంగా నిర్ధారిస్తూ ప్రాజెక్ట్ తీసుకున్న సమగ్ర విధానాన్ని ద్వారా చైతన్యం తీసుకువచ్చి ధైర్యాన్ని నింపాలన్నారు. మండల స్థాయిలో మాస్టర్ ట్రైనర్లు అవగాహన కల్పించాలన్నారు. గ్రామస్థాయిలో బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కిషోర్ బాలికలను 10 నుంచి 15 మందిని గ్రూప్ లుగా ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే పిజిఆర్ఎస్‌లో ఎటువంటి క్రిమినల్ కేసులు వచ్చిన పోలీస్ శాఖ ఫార్వర్డ్‌చేసి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లా ఎస్పీ డి.నరసింహా కిషోర్ మాట్లాడుతూ కిశోరి బాలికలు బాల్యం నుండి యుక్తవయస్సు వరకు సమాజంలో వారి ఎదుగుదలకు ఎవరు నుండి మోసపోకుండా అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో జిల్లా కలెక్టర్ నేతృత్వంలో మహిళలకు సహాయాన్ని అందించే విధంగా ఇటీవలి "మహిళా రక్షక్" కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం పట్ల మంచి స్పందన కూడా వస్తుందన్నాసారు. మండల స్థాయిలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తే మహిళలకు మరింత రక్షణ ఉంటుందని సూచించారు. ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి కె.విజయలక్ష్మి జిల్లాలో కిశోరి బాలికల ప్రధాన అంశాల వివరాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డి ఎల్ ఎస్ ఎ కార్యదర్శి కె.ప్రకాష్ బాబు, ఐసిడిఎస్ పిడి కె.విజయలక్ష్మి, డీఈఓ కె. వాసు దేవ రావు, డిఎంహెచ్ ఓ డా. కే వెంకటేశ్వరరావు, డి సి హెచ్ ఓ డా.ఎన్ పి పద్మశ్రీ, ఎస్ ఎస్ ఏ పిడి ఎస్..సుభాషిణి, డిఎస్పీ భవ్య కిశోర్, జిల్లా వొకేషనల్ అధికారి సుబ్రహ్మణ్యం, ఆర్ బి ఎస్ కే కోఆర్డినేటర్ డా.హరిహర,జిల్లాచైల్డ్ ప్రొటెక్షన్‌అధికారి సి.రాజ్‌కుమార్,ఐసిడిఎస్, మండలస్థాయి అధికారులు విద్యార్థులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సత్యసాయి బాబా 99వ జయంతి



**అంబాజీపేట,మేజర్‌న్యూస్ :** భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి 99వ జయంతి వేడుకలను అంబాజీపేట సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాచవరం, కొర్లపాటివారిపాలెం,అంబాజీపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు, రబ్బర్లు, పెన్సిల్లు, స్వీట్లను పంచిపెట్టారు. అంతకుముందు ఓంకార, సప్రభాత, నగర సంకీర్తనలు చేశారు. డాక్టర్ ఢిల్లీబాబు ఇంటి వదర్ద బాలవికాస్ పిల్లలచే ఉయ్యాల సేవను చేపట్టారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## పోలింగ్ బూత్‌ను పరిశీలించిన తహశీల్దార్ వెంకటలక్ష్మీ



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈ నెల 23, 24 తేదిలలో (శని, ఆదివారాలలో) కొత్త ఓట్లు నమోదు చేస్తున్నట్లు తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి తెలిపారు. ప్రతీ పోలింగ్ బూత్‌లో స్పెషల్ సమరి రివిజన్ 2025లో భాగంగా స్పెషల్ క్యాంపెయిన్‌డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ తెలిపారు. ఓటు నమోదు కార్యక్రమంలో జనవరి 1, 2025 నాటికి 18 సం.లు నిండిన ప్రతీ ఒక్కరూ అర్హులని, ఫారం-6 ద్వారా ఓటుకు ధరఖాస్తు చేసుకోవచ్చునని, ఫారం-7 ప్రకారం తొలగింపులకు, ఫారం-8 ప్రకారం పేర్లు మార్పులు, చేర్పులు చేసుకోవచ్చునని ఆమె తెలిపారు. ఈ రెండు రోజులలో ప్రతీ బూత్ లెవెల్ అధికారి పోలింగ్ స్టేషన్ల వద్ద ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉండి ధరఖాస్తులు స్వీకరిస్తారని, ఈ అవకాశం ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ వెంకటలక్ష్మీ సూచించారు. దీనిలో భాగంగా పెద్దాపురం మండలంలో జి.రాగంపేట గ్రామంలోని 44,46 పోలింగ్ స్టేషన్‌లను ఆమె పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

## వాడపల్లికి కార్తీక శోభ

- భక్త జనంతో పులకించిన వాడపల్లి







**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** కార్తీక మాసం నాలుగవ శనివారం కోనసీమ తిరుమలగా విరాజిల్లు తున్న వెంకటేశ్వర స్వామివారి ఆలయం భక్త జనంతో పులకిం చింది. ఏడు శనివారాల వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్యఫలం అనే నానుడితో కర్ణాటక ఒడిస్సా తమిళనాడు ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి వేలాదిమంది భక్తులు తరలివచ్చి గోవిందా ముకుందా అంటూ స్వామివారిని దర్శించి మొక్కుబడులు తీర్చుకుంటున్నారు. స్వామివారికి సుప్రభాత సేవ, నీరాజనం మంత్రపుష్పం, పుణ్యవచనం, కళ్యాణం వంటి కార్యక్రమాలను అర్చక బృందం వైభవంగా నిర్వహించారు. వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ అనంతరం అన్నదానం నిర్వహించారు. శనివారం ఆలయంలో నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రవ ాలు అందరినీ అలరించాయి. స్వామివారి ఆదాయం 45 లక్షలు సమకూరింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# ఘనంగా ధాత్రి పూజ, హెూమము





**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ధాత్రి పూజ నిర్వహించడం ద్వారా భగవంతుని యొక్క కృపకు పాత్రులు అవుతామని మధ్వ పురోహితులు యాతగిరి మద్వేష్ అన్నారు. స్థానిక గోడారిగుంట జర్నలిస్టు కాలనీలో వేంచేసి ఉన్న శ్రీ రమా సహిత సత్యదేవ మందిర ప్రాంగణంలో ఉత్తరాది మఠాధిపతులు శ్రీ సత్యాత్మతీర్థ స్వామీజీ అనుగ్రహంతో శనివారం ధాత్రి పూజ మరియు హెూమము ఘనంగా నిర్వహించబడింది. తొలిత ధాత్రి మండపారాధన కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలస చేసి రిలయన్స్ ఉన్నతాధికారి ప్రవీణ్‌కుమార్ ఉత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి,దాసాంజనేయ, సీతా సమేత రామలక్ష్మణ హనుమాన్, శ్రీ భూ సమేత వెంకటేశ్వర స్వామితోపాటు ఉసిరి చెట్టు మరియు తులసి మొక్కలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన వస్త్రాలతో అలంకార కార్యక్రమాన్ని అద్భుతంగాచేశారు. ధాత్రి హెూమము, నవగ్రహ హెూమము, ధన్వంతరి హెూమము, ఆయుష్య హెూమములను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు, కార్తీక మాస మరియు ధాత్రి పూజ వైభవాన్ని ఆధ్యాత్మికవేత్త డాక్టర్ యాతగిరి పరశురామ్ వివరించారు. హెూమ కార్యక్రమాలన్నీ గోశాలలో నిర్వహించారు. కార్యక్రమంలో కాకినాడ మధ్వ సభ కార్యదర్శి కోపల్లె శేషగిరిరావు, ఉపాధ్యక్షులు తాడూరి రంగారావు, కోశాధికారి వేముగంటి రాము, కార్యవర్గ సభ్యులు రాచూరి శేషగిరిరావు, ఉదయగిరి శేషగిరిరావు, జాగిర్ధర్ ప్రేమ్ కుమార్, తాడూరి వాసు, సూత్రాల శ్రీనివాసరావు, కోఠి గోపాల్‌రావు, టంకసాల శ్రీనివాసరావు, పి.సంజీవ్, ధన్వాడ సందీప్, పన్యాల బుజ్జి, హుండీ సత్యనారాయణ, గోపిక ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. భక్తులందరికీ తిరుమల శ్రీనివాసుని కళ్యాణ అక్షింతలు మరియు తిరుచానూర్ పద్మావతి అమ్మవార్ల కుంకుమ ప్రసాదాలను తుంగమణి, మౌనిక లు అందచేసారు. పూర్ణాహుతి కార్యక్రమాన్ని భక్తులందరిచేత యాతగిరి మద్వేష్ నిర్వహింపచేసారు.

## దాతలు ముందుకు రావాలి

**కాకినాడ, మేజర్ న్యూస్ :** చిన్నారి జాహ్నవిశ్రీ (9) నాగుల చవితినాడు గౌను అంటుకుని 70% కాలిన గాయాలతో స్థానిక క్యాపిటల్ హాస్పిటల్ నందు గత 18 రోజులుగా చికిత్స పొందుతోందని, ఆ పాపకి చర్మం కోయంబత్తూరు నుండి విమానం ద్వారా 25 సార్లు తెప్పించి ప్లాస్టిక్ సర్జరీ చేయాల్సి వుందని, దీనికి సుమారు రూ.5-6 లక్షలు ఖర్చు అవుతుందని, దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి సహాయం అందించాలని యంగ్ మైండ్స్ ఫౌండర్ వాకార వెంకటరమణ (చిన్ని మాస్టారు) పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ నిరుపేద కుటుంబం ఇప్పటివరకు 3.5 లక్షల రూపాయలు ఖర్చు పెట్టారని, కాపిటల్ హాస్పిటల్ డాక్టర్లు రూము అద్దెలు, మెయిన్ డాక్టర్ల కన్సల్టేషన్ లేకుండా పాపకి వైద్యం చేస్తున్నారని తెలిపారు. యంగ్ మైండ్స్‌ని సహాయం కోరగా యంగ్ మైండ్స్ సభ్యులు రూ.70 వేలు పోగు చేసి సంకురాత్రి ఫౌండేషన్ ఛైర్మన్ డా. చంద్రశేఖర్ ద్వారా యిప్పించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుండి కూడా ప్రయత్నం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షులు నరాల కృష్ణకుమార్, కె.కామేశ్వరరావు, డా. సందీప్, డా. నితిన్, డా.సుభాష్, డా.సృజన బృందం, పిల్లి గోవిందరాజులు, కె.వి.రమణ, బి.లీల, ఎండి. కరీమ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫించను పంపిణీ విధానంలో నూతన మార్గదర్శకాలు -కమీషనర్ పద్మావతి




**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** ఎన్‌టిఆర్ భరోసా ఫించను విధానంలో రాష్ట్ర ప్రభుత్వం నూతన మార్గదర్శకాలు జారీ చేసిందని, మున్సిపల్ కమీషనర్ కె.వి.పద్మావతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె తెలుపుతూ ఫించను సొమ్ము పంపిణీ చేసే విధానంలో అందుబాటులో లేని లబ్దిదారులకు వారికి మూడు నెలల వరకు బకాయి సొమ్ముతో పంపిణీ చేయడం జరుగుతుందని, వరుసగా రెండు నెలలు తీసుకొకపోతే తరువాత నెలలో మూడు నెలల ఫించను సొమ్ము అందుకోవచ్చునన్నారు. వరుసగా మూడు నెలలు తీసుకోకపోతే శాశ్వత వలసగా పరిగణించి, ఫించను రద్దుచేస్తామని తెలిపారు. ఒకవేళ ఫించను పునరుద్ధరణకు అభ్యర్థిస్తే సచివాయలం, మున్సిపల్ కార్యాలయంలో ఫించను నిలిపివేసిన మూడు నెలల లోపు ధరఖాస్తు సమర్పించాలని ఆమె తెలిపారు. ఇలాంటి పరిస్థితులలో ఫించను పునరుద్ధరించిన పాత బకాయిలు ఇవ్వబడవని ఆమె తెలిపారు. అలాగే ఫించను పొందుతున్న భర్త మరణిస్తే భార్యకు మంజూరు చేస్తారని, ఫించను దారుడు మరణ నమోదు సమయంలో అతని జీవిత భాగస్వామి ఆధార్, ఫోన్ నెంబర్ సేకరించాలని, సచివాలయ సిబ్బందికి సూచించడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఫించనుదారుడు మరణ ధృవపత్రంతో అతని భార్య పేరు మీద ఎన్‌టిఆర్ ఫించను పోర్టల్‌లో ధరఖాస్తు చేయాలని కమీషనర్ తెలిపారు. కావున ఫించనుదారులు ఈ విషయం గ్రహించాలని ఆమె సూచించారు.

# నాన్ టీచింగ్ సిబ్బందికి ఎంఎస్ ఆఫీస్‌పై శిక్షణా కార్యక్రమం

- రెండురోజులపాటు నిర్వహణ





**కాకినాడ,మేజర్‌న్యూస్ :** జెఎన్‌టియుకె ప్రాంగణంలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెంటర్ (ఎఫ్‌డిసి) ఆధ్వర్యంలో యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ (యుసిఇకె) పరిపాలనా భవనంలోని పిజి రీసెర్చ్ ల్యాబ్ నందు రెండు రోజుల పాటు నాన్ టీచింగ్ సిబ్బందికి నిర్వహించనున్న ఎంఎస్ ఆఫీస్‌పై శిక్షణా కార్యక్రమం శనివారం ఉదయం ప్రారంభమైంది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ.వి.రవీంద్రనాథ్ ముఖ్యఅతిథిగా విచ్చేయగా గౌరవ అతిథులుగా ఎఫ్‌డిసి డైరెక్టర్ ప్రొ.పి.సుబ్బారావు, సిన్‌టాక్స్ ఎన్ కంపెనీ సేల్స్ హెడ్ ఎం.వెంకట్‌లు విచ్చేశారు. శిక్షణా కార్యక్రమానికి ఎస్ఐటి అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీ విజికె.కశ్యప్, సిఎస్ఈ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.రఘురామ్‌లు కో-ఆర్డినేటర్‌లుగా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ.వి.రవీంద్రనాథ్ మాట్లాడుతూనిరంతర అభ్యసన ద్వారాజ్ఞానంఎప్పుడూ పెరుగుతూ ఉంటుందన్నారు. ఏదైనా ఒక సంస్థకు డేటా నిర్వహణ చాలా ముఖ్యమని, క్రింది స్థాయి సిబ్బంది డేటాను సక్రమంగా నిర్వహిస్తే ఆ సంస్థ విజయవంతంగా ముందంజలో ఉంటుందన్నారు. పాలనా సౌలభ్యానికి సమయపాలనతోపాటు క్రమశిక్షణ చాలా ముఖ్యమని, దీన్ని దృష్టిలో ఉంచుకుని విధి నిర్వహణను నిర్వర్తించాలన్నారు. ఉద్యోగులుగా మీ కోసం మీరు నేర్చుకుంటే తమ నైపుణ్యాలను మరింత మెరుగుపర్చుకునేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ప్రస్తుత సాంకేతికత యుగంలో సమాచార నిర్వహణ అంతాడిజిటలైజ్ అవుతుందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా డిజిటలైజేషన్‌కు అత్యంత ప్రాధాన్యతనిస్తుందన్నారు. ఎంఎస్ ఆఫీస్ టూల్స్‌లోని అడ్వాన్స్ టెక్నిక్స్‌ను నేర్చుకుని తమ పనిని మరింత సులభతరం చేసుకోవాలన్నారు. ఎఫ్‌డిసి డైరెక్టర్ ప్రొ.పి.సుబ్బారావు మాట్లాడుతూ ఒక వ్యవస్థలో మనం పనిచేసేటపుడు ఆ వ్యవస్థ యొక్క అభివృద్ధి మనం చేస్తున్న పనిపై ఆధారపడి ఉంటుందన్నారు. ఉన్నతాధికారుల సలహాలు, సూచనలను క్రింది స్థాయి సిబ్బంది పాటించినపుడే పరిపాలనా వ్యవస్థ సక్రమంగా నిర్వహించ బడుతుందన్నారు. మనిషి జీవితంలో సాంకేతికత అనేది ఒక భాగమైపోయిందని, ప్రస్తుత తరుణంలో సాంకేతికత లేకుండా జీవితంలో అభివృద్ధి సాధించలేమన్నారు. సాంకేతిక విశ్వవిద్యాలయమైన జెఎన్‌టియుకెలో ఉన్నతాధికారుల నుండి క్రింది స్థాయి సిబ్బంది వరకు సాంకేతికతను అందిపుచ్చుకుని విశ్వవిద్యాలయ పురోభివృద్ధికి కృషి చేయాలన్నారు. చిన్న చిన్న సాంకేతిక అంశాలను నేర్చుకుని పనిని సులభతరం చేసుకోవచ్చునన్నారు. సిన్‌టాక్స్ ఎన్ కంపెనీ సేల్స్ హెడ్ ఎం.వెంకట్ మాట్లాడుతూ ఎంఎస్ ఆఫీస్‌పై రెండు రోజుల పాటు జరిగే శిక్షణా కార్యక్రమంలో వివిధ సాంకేతికతలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐఐపి&టి డైరెక్టర్ ప్రొ.బి.టి.కృష్ణ, ఐఓడబ్ల్యు&జి డైరెక్టర్ ప్రొ. యు.వి.రత్నకుమారి, సిన్‌టాక్స్ ఎన్ కంపెనీ నుండి రీసోర్స్‌పర్సన్‌లు, నాన్ టీచింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


## గ్రామీణ రహదారులకు గ్రహణం వీడేదెప్పుడో



**ఎటపాక, మేజర్ న్యూస్ :** దేశానికి పట్టుకొమ్మలు గ్రామాలు, గ్రామాలు అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందుతుంది. రోడ్లు అభివృద్ధికి చిహ్నాలు, అలాంటి గ్రామాల్లో రహదారులు మరమ్మతులకు గురైనా పట్టించుకునే నాధుడు కరువయ్యాడు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామీణ రహదారులపై సీత కన్ను వేసింది. ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో కొత్త రోడ్ల నిర్మాణాలు చేపట్టకపోగా, కనీసం మరమ్మత్తులకు గురైనవాటిని కూడా పట్టించుకోలేదు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలంలోని గుండాల కాలనీ, కే.ఎన్.పురం, గౌరీదేవి పేట, రాయనపేట, మంగువాయి తదితర గ్రామాల్లో గ్రామీణ రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. ఆ రహదారులలో ప్రయాణించాలంటే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వర్ష కాలంలో, రాత్రి వేళలో ఆ రహదారులలో ప్రయాణించడం చాలా ప్రమాదకారం. ఆ రహదారులలో ఎన్నో ప్రమాదాలు సంభవించినవి. ఆ రహదారుల నిర్మాణం గతం టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించబడినవి. ప్రస్తుత ఈ కూటమి ప్రభుత్వం హయాంలో అయినా గ్రామీణ రహదాలకు గ్రహణం వీడుతుందా, లేదా గత ప్రభుత్వం మాదిరిగానే ఉంటుందా అనే ప్రశ్నలు ప్రజల్లో తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి గ్రామీణ రహదారుల నిర్మాణాలను చేపట్టాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

సూర్య
తూర్పుగోదావరి
ఆదివారం, 24 నవంబర్ 2024


# మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తులకు ఫైన్




**– 23 మంది వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ. 10,000/- చొప్పున ఫైన్**

**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గత కొద్దిరోజులనుండీ మద్యం సేవించి మోటార్ వాహనాలను నడుపుతూ డ్రంక్ & డ్రైవ్ పట్టుబడిన 23 మంది వ్యక్తులను పిఠాపురం పిన్సిపల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వారి ఎదుట హాజరుపర్చగా... మేజిస్ట్రేట్ విజయ రామేశ్వరి ఒక్కకరికీ రూ.10,000/- చొప్పున మొత్తం రూ.2,30,000/- అపరాధ రుసుము విధించినట్లు పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.శ్రీనివాస్ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. వారిని కోర్టులో సక్రమంగా ప్రవేశపెట్టిన పిఠాపురం పట్టణ కోర్టు కానిస్టేబుల్ ను పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.శ్రీనివాసు మరియు పిఠాపురం పట్టణ సబ్- ఇన్స్పెక్టర్ వి.మణికుమార్ అభినందించారు.

# పాదగయా క్షేత్రాన్ని దర్శించుకున్న సినీ నటుడు జోగినాయుడు



పిఠాపురం, మేజర్ న్యూస్ : దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ప్రముఖ పుణ్యక్షేత్రం పాదగయ క్షేత్రాన్ని ప్రముఖ సినీ నటుడు, వైఎస్ఆర్సిపి రాష్ట్ర నాయకులు జోగి నాయుడు దర్శించు కున్నారు. సతీ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయన కుక్కుటేశ్వర స్వామి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రముఖ పుణ్యక్షేత్రం పాదగయా క్షేత్రాన్ని దర్శించుకోవడం సంతోషంగా ఉందని, అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్టు తెలిపారు. ఆయన వెంట ఆయన ఆయన మిత్రుడు, కాంట్రాక్టర్ ముమ్మిడి శివశంకర్ ఉన్నారు.

# లయన్స్ క్లబ్ ఎలైట్ సేవలు స్ఫూర్తిదాయకం - లయన్స్ గవర్నర్

**కాకినాడ, మేజర్ న్యూస్ :** లయన్స్ క్లబ్ ఎలైట్ చేస్తున్న విబిన్న సామాజీక సేవా కార్యక్రమాలు ఇతర క్లబ్‌లకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఇ.వి.వి.ఈశ్వర్ కుమార్ పేర్కోన్నారు. కాకినాడ అచ్చంపేట జంక్షన్ వద్ద లయన్స్ క్లబ్ ఎలైట్ ఆధ్వర్యంలో అధికార పర్యటనకు విచ్చేసిన లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఇ.వి.వి.ఈశ్వర్ కుమార్ మంగాదేవి దంపతులకు ఘనస్వాగతం పలికారు. అక్కడ నుండి ప్రత్యేక వాహనంపై వారిని భారీ ఊరేగింపుగా (ర్యాలీగా) అక్కడేవున్న ఏకంబరేశ్వరస్వామివారి ఆలయంకు తీసుకువెళ్ళి అక్కడ ప్రత్యేక పూజలు చేయించారు. అక్కడ నుండి ర్యాలీగా కల్పన సెంటర్ లోగల మహర్షి బులుసు సాంబమూర్తి వికలాంగ బాలికల ఆశ్రమ పాఠశాల వద్దకు తీసుకువచ్చారు. సాంబమూర్తి పాఠశాల వద్ద చిన్నారులు పూలు జల్లుతూ లయన్ క్లబ్ సభ్యులకు ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి లయన్స్ క్లబ్ ఎలైట్ ప్రెసిడెంట్ మైలవరపు సత్యనారాయణ అద్యక్షత వహించగా లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఈశ్వర్ కుమార్ మంగదేవి దంపతులు ముఖ్యఅతిధులుగాను, రీజనల్ చైర్‌పర్సన్ పద్మతులసి విశిష్ట అతిధిగాను, జోన్ చైర్‌పర్సన్ చిట్నీడి నాగమణి గౌరవ అతిధిగా పాల్గొన్నారు.కార్యక్రమంలో పాల్గొన్న అతిధులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేదాశీర్వచనం అందించారు. తొలుత ముఖ్యఅతిధులు ఈశ్వర్ కుమార్ మంగదేవి దంపతులు, ప్రెసిడెంట్ మైలవరపు సత్యనారాయణలు మహర్షి సాంబమూర్తి వికలాంగ ఆశ్రమ పాఠశాల ప్రాంగణంలోగల ఉసిరి చెట్టుకు సాంప్రదాయంగా పూజలు చేసి పర్యావరణ పరిరక్షణలో బాగంగా మొక్కలు నాటారు. అనంతరం లక్ష 50 వేల రూపాయలతో నూతనంగా నిర్మించిన ఆర్.ఓ. ప్లాంటును ముఖ్యఅతిధి ఈశ్వర్‌కుమార్ దంపతులు పూజా కార్యక్రమం నిర్వహించి కొబ్బరి కాయలు కొట్టి రిబ్బన్ కత్తిరించి ప్రారంబించారు.అదేవిదంగా క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప న్ను డిస్ట్రిక్ట గవర్నర్ ఈశ్వర్‌కు మార్ రిబ్బన్ కత్తిరించి ప్రారంబించారు.అనంతరం చిన్నారులకు ప్యాడ్స్ కాంసెస్ బాక్సు చాక్లెట్స్ను పంపిణి చేసారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిధు లను మహర్షి బులుసుసాంబమూర్తి వికలాంగ ఆశ్రమ పాఠశాల కార్యవర్గం ప్రెసిడెంట్ ప్రముఖన్యాయవాది జవహర్ ఆలీ, సెక్రటరీ దామెర మురళీ, ట్రెజరర్ సయ్యద్ సలార్‌లు లయన్స్ గవర్నర్ ఈశ్వర్ కుమార్, క్లబ్ అధ్యక్షులు సత్యనారాయణలను సాలువా కప్పి ఘనంగా సత్కరించారు.





గవర్నర్ అధికార పర్యటన ను పురస్కరించుని ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమంలో గవర్నర్ ఈశ్వర్‌కుమార్ మంగదేవి దంపతులు పాల్గొని చిన్నారులతో కేక్ను కట్ చేయించారు. ఈసందర్భంగా డిస్ట్రిక్ట్ గవర్నర్ ఈశ్వర్‌మార్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఎలైట్ చేస్తున్న విభిన్న సామాజీక సేవా కార్యక్రమాలు ఇతర క్లబ్‌లకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయన్నారు. రీజనల్ చైర్మన్ పద్మతులసీ మాట్లాడుతూ ఎలైట్ క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. క్లబ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ మాట్లాడుతూ చక్కటి సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు సహకరిస్తున్న క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేసారు. ఈకార్యక్రమంలో పాస్ట్ గవర్నర్ డా. బాదం బాలకృష్ణ ,క్లబ్ అడ్మినిస్ట్రేటర్ పాస్ట్ గవర్నర్ ముంజులూరి విశ్వేశ్వరరావు, ఫస్ట్ వి.డి.జి. చిట్నీడి శ్రీనివాస్, క్లబ్ అసిస్టెంట్ సెక్రటరీ రాఘవరావు, ట్రెజరర్ కె.వి.వి.సత్యనారాయణ, కెప్టెన్ మంగరాజు, ఎస్.వి.వి.సుబ్రహ్మణ్యం, గుటూరు సత్యనారాయణ, నల్లమిల్లి సత్తిరెడ్డి, కిషోర్, కుమార్, కటకం శ్రీనివాస్, సాగర్, వాణి పెద్ద సంఖ్యలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# మహారాష్ట్రలో బిజెపి విజయంపై పిఠాపురంలో సంబరాలు



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** మహారాష్ట్ర, జార?ండ్ రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల ఫలితాల్లో మహారాష్ట్రలోని బిజెపి కుటమి ప్రభుత్వం అఖండ విజయం సాధించడం పట్ల పిఠాపురం నియోజవర్గ బిజెపి నాయుకులు హర్ష%శీ% వ్యక్తం చేశారు. మహారాష్ట్రలో కూటమి ప్రభుత్వానికి ప్రచారం చేసిన పవన్ కళ్యాణ్ కు పిఠాపురం జనసేన ఇన్చార్జ్ మర్రెడ్డి శ్రీనివాసరావుని కలిసి ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శిలు దాట్ల వెంకట సూర్య నారాయణరాజు, గండి కొండలరావు,పిఠాపురం టౌన్ ప్రెసిడెంట్ పసుపులేటి సత్యనారాయణ, గొల్లప్రోలు పట్టణ ప్రెసిడెంట్ చిట్టా మధు, కో -కన్వినర్ వాసంశెట్టి శ్రీనివాస్, తోట ఏడుకొండలు, బుర్రి మురళిధరరావు, కొమ్మిరెడ్డి భద్రరావు, అడ బాల వీర మోహనరావు, కర్రి అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

# శిధిలావస్థకు చేరిన పిఠాపురం సబ్ రిజిస్టార్ కార్యాలయం

**– నూతన భవన నిర్మాణం చేపట్టాలని దస్తావేజు లేఖర్ల వినతి**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం పట్టణంలో శిధిలావస్థకు చేరిన సబ్ రిజిష్టారు కార్యాలయాన్ని తొలగించి నూతన భవనం నిర్మించాలని పిఠాపురం దస్తావేజు లేఖరులు పిఠాపురం జనసేన పార్టీ ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ కు వినతి పత్రాన్ని సమర్పించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తమ సమస్యలను తీసుకువెళ్లాలని కోరారు. బ్రిటిష్ కాలం నాటి 1898 సంవత్సరంలో నిర్మాణం చేపట్టిన సబ్ రిజిస్టర్ కార్యాలయం కావడంతో నేడు శిధిలావస్థకు చేరుకుందన్నారు. ఈ సబ్ రిజిస్టర్ కార్యాలయ పరిధిలో సుమారుగా 50 గ్రామాలు ఉన్నాయని, ప్రతి రోజు వందలాదిమంది సబ్ రిజిస్టర్ కార్యాలయానికి వస్తుంటారని, కార్యాలయానికి వచ్చిన వారికి కూర్చోవడానికి సరైన వసతి లేదని వివరించారు. వర్షాకాలం వస్తే కార్యాలయంలో రికార్డులు తడిసిపోతున్నాయని, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవ తీసుకుని సబ్ రిజిస్టర్ కార్యాలయ నూతన భవనం నిర్మించాలని పిఠాపురం నియోజకవర్గ ప్రజలు దస్తావేజు లేఖర్లు తదితరులు కోరుతున్నారు.

# చింతూరు ఏజెన్సీలో వాలంటీర్లు ర్యాలీ

**చింతూరు, మేజర్ న్యూస్ :** ఎన్నికల ప్రచారంలో ఇప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సియం పవన్ కళ్యాణ్ వాలంటీర్ వ్యవస్థ గురించి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ గ్రామ, వార్డు వాలంటీర్స్ ఉద్యోగ భద్రత కల్పించాలని, బకాయి వేతనాలు చెల్లించాలని 10 వేల వేతనహామీ నెరవేర్చాలని, జాబ్ చార్ట్ ప్రకటించాలని, బలవంతంగా రాజీనామా చేయించినవారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామికి ఘనంగా లక్ష బిల్వార్చన పూజ



**రాజవొమ్మంగి, మేజర్‌న్యూస్ :** రాజవొమ్మంగి కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ సన్నిధిలో వేం చేసి ఉన్న శ్రీ శ్రీ శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి వారికి శనివారం ఘనంగా లక్ష బిల్వపత్రాలతో పూజలు నిర్వహించారు. కార్తీక మాసం పురస్కరించుకొనిమైదాన ప్రాంతాల నుండి వచ్చిన పండితులు ఆ మహాదేవునికి రుద్రాభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్న సమారాధనకు వందలాది మంది భక్తులు తరలివచ్చి అన్న ప్రసాదాలు స్వీకరించారు. తొలుత భక్తులు మహాశివుని, కళ్యాణ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో అడ్డూరి వీరవెంకట సత్యనారాయణ రాజు, దంతలూరి శివరామచంద్ర రాజు, కృష్ణ, బివిఎస్ఎన్ గుప్తా తదితరులు ఉన్నారు.

# ఒకే పాఠశాలలో 35 గోల్డ్ మెడల్స్




**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** ఈ నెల 20 నుండి 22 వరకు పాడేరులో జరిగిన ఆటల పోటీలులో రాజవొమ్మంగి ఏకలవ్య మోడల్ పాఠశాల విద్యార్థులు 35 గోల్డ్ మెడల్స్ సాధించినట్లు ప్రిన్సిపాల్ కృష్ణారావు తెలపారు. వీటితో పాటు నాలుగు సిల్వర్,4 బ్రాంజ్ మెడల్స్ విద్యార్థులుకైసం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. జూడో, వెయిట్ లిఫ్టింగ్, యోగ, వాలీబాల్ క్రీడల్లో విజేతలుగా నిలిచారన్నారు. 19 మంది బాలికలు 25 మంది బాలురు క్రీడల్లో పాల్గొన్నారన్నారు. తర్ఫీదునిచ్చిన పిఈటిలను, విజేతలను స్థానిక ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

# అభివృద్ధికి నోచుకోని ఆదివాసీ జీవితాలు




**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** ఆదివాసీ జీవితాలు అభివృద్ధికి నోచుకోవడం లేదని, ఆదివాసీ చట్టాలకు అధికారులు తూట్లు పొడుస్తున్నారని, చట్టాలు పేరిట అధికార పార్టీ నాయకులు దందాలు చేస్తున్నారని ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను ఆరోపించారు. గంగవరం మండలం రాజంపాలెంలో డివిజన్ స్థాయి అత్యవసర సమావేశం కంగల అబ్బాయి దొర అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఆదివాసులు బతుకుల్లో మాత్రం మార్పులు రావటం లేదని ఆయన ఆవేదన వ్యక్తం పరిచారు. ప్రభుత్వంలో రాకముందు ఒక మాట ప్రభుత్వంలో వచ్చాక ఒక మాట ఎన్నికల్లో ఇచ్చిన మాటల్ని విస్మరిస్తూ ఆదివాసి జీవోలు చట్టాలకు ఈ ప్రస్తుత ప్రభుత్వం కూడా తూట్లు పొడుస్తుంది అని ఆయన విమర్శించారు. ఏజెన్సీ ప్రాంతంలో విచ్చలవిడిగా నాన్ ట్రైబల్ అక్రమ దుకాణ వ్యాపారం సాగుతున్న, అక్రమ కట్టడాలు మరియు అక్రమ వ్యాపారాలపై ఆదివాసి సంక్షేమ పరిషత్ పోరాటం చేస్తా ఉంటే గిరిజనేతరులకు అండగా అధికార పార్టీ నాయకులు ఉంటూ వాళ్ళు ఇచ్చే ముడుపులకు లోబడి అధికారుల్ని లోపర్చుకుంటున్నారని అదేవిధంగా నాన్ ట్రైబల్స్ నుంచి సొమ్ము చేసుకుంటున్నారని ఆయన విమర్శించారు. వన్ బై 70 చట్టానికి వ్యతిరేకంగా నాన్ ట్రైబల్స్ ఏజెన్సీ ప్రాంతంలో కడుతున్నటువంటి అక్రమ కట్టడాలకు కు వ్యతిరేకంగా ఆదివాసి సంక్షేమ పరిషత్తు పోరాటం చేస్తూ ఐటిడిఏ పిఓ గారి కి సబ్ కలెక్టర్ గారి కి జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తూ ఉంటే, కనీసం అధికారుల్లో నుంచి గాని ప్రజాప్రతినిధుల్లో నుంచి గాని ఎటువంటి చలనం లేదని ఆయన ఆరోపించారు. స్వయంగా ఎమ్మెల్యే మండల కేంద్రంలోనే బహిరంగంగా కోట్ల రూపాయలు విలువచేసే అక్రమ కట్టడాలు కడుతున్నా ఎటువంటి చర్యలకు నోచుకోకపోవడం దేనికి సంకేతమో అర్థం కావడం లేదని ఆయన అనుమానం వ్యక్తపరిచారు. అక్రమ కట్టడాలపై ఫిర్యాదు చేస్తున్న ఆదివాసి సంక్షేమ పరిషత్ కార్యకర్తలకు అధికార పార్టీ నాయకులు కొంతమంది ఫోన్ కాల్ చేస్తూ వాటిని వదిలి పెట్టాలని చెప్పటం సరికాదని, అటువంటి చర్యలకు పాల్పడితే ఆదివాసి సంక్షేమ పరిషత్తు యొక్క ఉద్యమం తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు. పంచాయితీ రెవెన్యూ ఐటీడీఏ అధికారులు మామూళ్లు మత్తు వదిలి ఇప్పటికైనా ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసి చట్టాల రక్షణకు తోడ్పాటు ఇవ్వాలని లేకుంటే ప్రభుత్వ కార్యాలయాలు మరియు ఎంపీ ఎమ్మెల్యే కార్యాలయాలు, ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. షెడ్యూల్ ప్రాంతంలోని ఆదివాసులు కూడా తమ వంతు బాధ్యతగా నాన్ ట్రైబల్‌కి, ఇతరులకు బినామీలుగా ఉండకుండా ఆదివాసి భూములు రక్షించుకోవాలని లేకుంటే రాబోయే తరాలకు భూమి లేకుండా పోతుందని ఆయన హెచ్చరించారు ఆదివాసులకు భూమి లేకుంటే ఆదివాసి యొక్క ఉనికేకే ప్రమాదం పొంచి ఉంటుందని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. ఆదివాసి సంక్షేమ పరిషత్ చేస్తున్న న్యాయ పోరాటంలో ప్రతి ఆదివాసి భాగ్యస్వామ్యం అయ్యి మన హక్కులు చట్టాలు అమలుకై పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈసమావేశంలో ఆదివాసి సంక్షేమ పరిషత్తు జిల్లా అధ్యక్షులు తీగల బాబురావు, డివిజన్ అధ్యక్షులు మోడిద నూకరాజు, ప్రధాన కార్యదర్శి సోడి ప్రదీప్ కుమార్, ఉపాధ్యక్షులు బొరగ యర్రమ్మ, సోడి ఏడుకొండలరావు దొర, పీఠ ప్రసాద్ డివిజన్, మండలాల నాయకులు పాల్గొన్నారు.

# ద్రోన్ సహాయంతో పంట పొలాలకు రసాయనాలు పిచికారీ



**ఎటపాక,మేజర్‌న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం నందిగామ గ్రామంలో రైతులు శనివారం పంట పొలాలకు మిర్చి,మొక్కజొన్న తోటలకు డ్రోన్‌ను వాడి రసాయనాలు పిచికారీ చేస్తున్నారు. డ్రోన్ సహాయంతో పిచికారి చేయడం వల్ల కూలీల శ్రమ తగ్గుతుందనీ,సమయం ఆదా అవుతుందని రైతులు చెప్తున్నారు. వ్యవసాయం పనులు చేయుటకు కూలీలు దొరకడం లేదు అని, వ్యవసాయానికి ఇలాంటి పరికరాలు చాలా ఉపయోగపడుతున్నాయి అని, తక్కువ సమయంలో ఎక్కువ పని చేయవచ్చు అని, డబ్బు కూడా ఆదా అవుతుంది అని స్థానిక రైతులు తెలిపారు.

# విద్యా సంబంధిత అంశాలపై రాష్ట్ర ఎస్టీ కమీషన్ సభ్యులు సమీక్ష





కాకినాడ, మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమీషన్ సభ్యులు వడిత్యా సోమ శంకర్ నాయక్ జెఎన్‌టియుకె కాకినాడ యూనివర్శిటీ ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ. కె.వి.ఎస్.జి.మురళీకృష్ణ మరియు అధికారులతో శనివారం సాయంత్రం విసి కాన్ఫరెన్స్ హాలు నందు రూల్ ఆఫ్ రిజర్వేషన్ మరియు విద్యా సంబంధిత అంశాలపై సమీక్ష నిర్వహించారు. యూనివర్శిటీలో చేపడుతున్న కార్యక్రమాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వడిత్యా సోమ శంకర్ నాయక్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం మరియు క్యాంపస్ కళాశాలల్లోను రూల్ ఆఫ్ రిజర్వేషన్ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అధ్యాపకులకు, సిబ్బందికి, విద్యార్థులకు పదోన్నతులలోను, విద్యాపరంగాను మరియు మౌలిక సదుపాయాలను నిబంధనలను అనుసరించి కల్పించాలన్నారు.

మానవ సేవే మాధవసేవ అని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచిత శిక్షణా తరగతులు నిర్వహించి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నారు. అలాగే యూనివర్శిటీలో ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను తొందరలో భర్తీ చేయాలన్నారు.ఎస్టీ & ఎస్సీ సెల్ లైజనింగ్ ఆఫీసర్ ఎం.కుమారస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ. కె.వి.ఎస్.జి.మురళీ కృష్ణతో పాటు ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ. వి.రవీంద్రనాధ్, ఓఎస్‌డి ప్రొ.డి.కోటేశ్వరరావు, డైరెక్టర్‌లు, స్పెషల్ ఆఫీసర్‌లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డిసెంబర్ 30న ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్స్ ఎలక్టోరల్ రోల్స్ తుది జాబితా

**– గతంలో కంటే అదనంగా 21 పోలింగ్ కేంద్రాలు ప్రతిపాదన**

**– తూర్పు-పశ్చిమ గోదావరి ఎంఎల్‌సి పట్టభద్రుల ఎన్నిక ఓటర్ల నమోదు ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షించిన డిఆర్ఓ టి.సీతారామమూర్తి**




**రాజమహేంద్రవరం, మేజర్‌న్యూస్ :** తూర్పు-పశ్చిమ గోదావరి ఎంఎల్‌సి పట్టభద్రుల ఓటర్లగా నవంబర్ 23 వ తేదీ నాటికి 51,624 మంది గ్రాడ్యుయేట్స్ ఓటర్లుగా తమ దరఖాస్తు నమోదు చేసుకోవడం జరిగిందని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి పేర్కొన్నారు. శనివారం డిఆర్ఓ ఛాంబర్‌లో డిఆర్ఓ సీతారామమూర్తి రాజకీయ పార్టీల ప్రతినిధులతో పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాల వారీగా తూర్పు-పశ్చిమ గోదావరి ఎంఎల్ సి పట్టభద్రుల ఓటర్ల గా తూర్పు గోదావరి జిల్లాకు చెందిన దరఖాస్తులు నవంబర్ 23 వ తేది నాటికి 51,624 దరఖాస్తు వచ్చాయని, ఇందులో పురుషులు 30292 మంది, మహిళలు 21328 మంది ఇతరులు 14 మంది ఉన్నారన్నారు.డ్రాఫ్ట్ ఓటరు జాబితా డిసెంబర్ 9 వ తేదీన ప్రకటించనున్నట్లు తెలిపారు. గతంలో కంటే అదనంగా 21 పోలింగ్ కేంద్రాలు పెరుగు తాయన్నారు.

-పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం షెడ్యూల్ :అభ్యంతరాలను దాఖలు చేయడానికి కాల వ్యవధి నవంబర్ 23 నుంచి డిసెంబర్ 9 వ తేది వరకు ఉంటుందన్నారు. క్లెయిమ్‌లు మరియు అభ్యంతరాలు సప్లిమెంట్‌లను పరిష్కరించే తేదీని సిద్ధం చేయడం జరుగుతుందని, డిసెంబర్ 25 వతేదిన ఎలక్టోరల్ రోల్స్ ప్రచురణ కాగా, పట్టభద్రుల ఓటర్ల తుది ఓటర్ల జాబితా డిసెంబర్ 30 వ తేదిన విడుదల చేయడం జరుగుతుందన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలింగ్ అయ్యే ఓటు చెల్లుబాటు అయ్యే విధంగా రాజకీయ పార్టీలు మాన్యుయేల్ ఓటింగు పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటర్ల పోలింగ్ కేంద్రాలకు సంబంధించి మండలానికి కనీసం ఒక పోలింగ్ స్టేషన్‌ను ప్రతిపాదించడం జరుగుతుందన్నారు. ఓటరు తన ఓటు వేయడానికి ప్రయాణించాల్సిన గరిష్టంగా అనుమతించదగిన దూరం 16 కి.మీ. ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాలు అన్ని ప్రభుత్వం భవనాల్లోనే ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 2 కంటే ఎక్కువ పోలింగ్ స్టేషన్లు, పట్టణ ప్రాంతాల్లో 4 పోలింగ్ స్టేషన్లు ఒక ప్రదేశంలో అనుమతించడం జరగదని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాలను గ్రౌండ్ ఫ్లోర్ లోనే ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్తు, మరుగుదొడ్లు, ఫర్నిచర్, పిడబ్ల్యుడి ఓటర్లకు ర్యాంప్‌లు వంటి కనీస ప్రాథమిక సౌకర్యాల లభ్యతను సమకూర్చడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు సిపిఎం పార్టీ తరఫున కర్రి రామకృష్ణ, బీఎస్పీ పార్టీ తరఫున పులగల ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# శృంగార వల్లభ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు

**– వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివార్కి ప్రత్యేక అలంకరణ**



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలం, తిరుపతి గ్రామంలో వేంచేసియున్న శ్రీశ్రీ శృంగార వల్లభ స్వామిని శనివారం వేలాది సంఖ్యలో భక్తులు దర్శించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కార్యనిర్వాణా ధికారి వడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా రూ.2,61,570/-, అన్నదాన విరాళాల ద్వారా రూ.72,748/-లు, కేశఖండన ద్వారా రూ.6,400/-, తులాభారం ద్వారా రూ.300/- లడ్డూ ప్రసాదాల ద్వారా రూ.45,180/- మొత్తం రూ.3,86, 198/-లు స్వామివారికి ఆదాయం రావడం జరిగిందని తెలిపారు. స్వామివారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించడం జరిగింది. అలాగే దేవస్థానం తరపున ఉదయం పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని, స్వామి వారి ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు పెద్దింటి నారాయణాచార్యులు, పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి గోపాలాచార్యులు, ఆలయ సిబ్బంది కృష్ణ, మోహనరావు, సత్యనారాయణ, ఇతర స్వచ్ఛంద సేవకులు, వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.